"అమ్మా! అమ్మా! ఈ పూలు ఎంత చక్కగా ఉన్నవో చూడమ్మా! నాకు ఇన్ని పువ్వులు ఎవరు ఇచ్చిరో చెప్పుకో! అమ్మా! నీవుకూడా నాతో వస్తే నీకూ పువ్వులు ఇప్పిస్తాను. రావే, అమ్మా! రా" అనుచు లీల వినయాదేవి చిత్రలేఖనమునకు అడ్డువచ్చి ఆమె చెరుగు పట్టి ఈడ్వసాగెను. వినయ "లీలా! ఎక్కడకు వచ్చుట? ఇంతవరకు ఎక్కడ నుంటివమ్మా? అదుగో, ఆకుంచె నటు పెట్టుము. ఆరంగులను తీయకమ్మా! లీలా, ఇంత మంచి వాసన పుష్పములు ఈ అడవిలో నీ కెవ రిచ్చిరమ్మా! ఇప్పు డిపుడే మీనాయనగారు నీ కొరకై వెదకుచు బోయిరి. ఒక్కచోట నుండవుగదా" అన లీల తల్లి మాటల సరకు గొనకయే "అమ్మా! ఒక్కమాటు రావే! పాపము ఎవరో తాత, ముసలి తాత, నా కివన్నీ ఇచ్చినాడమ్మా. చాలా మంచివాడు. నేను మా అమ్మ దగ్గరకు వెళ్లెదను, నన్ను వదలుము వదలుము అని ఎన్ని చెప్పినను వినక నన్నెత్తుకొని ముద్దాడి, ఇవన్నీ నాకిచ్చినాడు. కాని, అమ్మా! ఎందుకే తాత చిన్నపిల్లలాగ ఏడ్చుచున్నాడు. నిజముగా, అమ్మా! నాకు కూడా ఏడుపు వచ్చినదే. మీ అమ్మ కొట్టినదా అని నేను అడిగితే, గట్టిగా నవ్వినాడే. కాని మళ్లా ఏడుపే! నీవు వచ్చి అడుగవే" అని తొందర చేయసాగెను. వినయాదేవి చిత్తము చిత్రలేఖనమునం దైక్యమై ఉంటచే ఆమెకు లీలమాట లేమియు చెవి కెక్కుటలేదు. లీల మరల మరల ఆమెను తాత ఉన్న స్థలమునకు రా బలవంతము సేయ వినయ "లీలా!— చీకటి పడుచున్నది. మనము ఇప్పుడు బయలుదేరినగాని ఇల్లు జేరలేము. ఎచ్చటకు వెళ్లుటకు ఇప్పుడు వేళలేదమ్మా" అన లీల "ఔనమ్మా! నాకప్పుడే ఆకలి వేయుచున్నది. నిద్రకూడ వచ్చుచున్నదే. లే అమ్మా, ఇంటికి పోవుదము లే. పోనీ తాతను నీకు రేపు చూపెదనులే" అన వినయాదేవి లీలను తండ్రిగారు చుట్టుప్రక్కల నుందురు పోయి పిలుచుకొని రమ్మని పంపివైచి, మరల అప్పటి ప్రకృతిలావణ్యమును మిక్కిలి నేర్పుతో చిత్రించుచుండెను.

* * * *

లీలకు నాలుగు సంవత్సరములు. చక్కని చుక్క. అతిచురుకైనది. వయసునకు మించిన బుద్ధి. వినయాదేవీచిత్తరంజనుల ముద్దులపట్టి. చిత్తరంజనుడు శాంతిపురజమీందారు. ప్రాయము. 27 వత్సరములు. తండ్రి మహేంద్రుడీతని చిన్నతనముననే గతించెను. పాపము తల్లిని కూడ ఈతను రెండు వర్షములక్రితమే గోలుపోయెను. మూఢాచార మంతయు ఈమెయందే గలదు. పట్టుదలకు పరిమితి లేదు.

వినయాదేవికూడ మిక్కిలి శ్రీమంతుల ఇంట జన్మించినది. తలిదండ్రుల కేక పుత్రిక. కమలాకరుడను సోదరుడు మాత్రము గలడు. ఆమె విద్య బాగుగా నేర్చియుండెను. గాన విద్యయం దపరభారతియే యనవచ్చును. కుట్టు పనులన్నిటియందును ఈమెకు ప్రవీణత యున్నను, ఇది చిత్రలేఖనమునం దీమె నేర్పుకు సాటిరాదు. సార్థకనామధేయుడు చిత్తరంజనుడు వినయాదేవిని పరిణయం బాడి సుమారు ఆరు వర్షములాయెను. పెండ్లినాటికి వినయ పదునాఱు సంవత్సరముల ప్రాయపు జవ్వని.

చిత్తరంజనునకు దేనియందును లోటు లేదు. ఆతని సౌధము లక్ష్మీదేవి నివాసస్థానమును మరపించుచుండెను. సమస్త సౌకర్యములు గలిగియున్నను, ఏలనో చిత్తరంజనుడు అంత ఉత్సాహముగా నున్నటుల తోపడు. ఏదో గూఢవిచారమొ, మరి ఏదియో ఆతని హృదయశల్యమై రేయింబవళ్లాతని బాధించుచుండెను. పైకిమాత్రము పెదవులయందే జన్మించి అచటనే అంతమగుచున్న విషాద పూరిత మందహాసము మాత్రము సదా చేయుచుండును. ఒంటరిగా నున్నప్పుడు మాత్రము ఈ నటనను త్రోసిపుచ్చి ఏదో దీర్ఘాలోచన జేయుచు ఎన్నిగంటలైనను గడుపుచుండును. మరియొకప్పుడు తన కన్నీటిధారచే వక్షస్థలమును దడుపుచు, ఆ విధముగానైన తన హృదయావేదనను చల్లపరుపప్రయత్నించుచుండెడివాడు. ఎన్ని మోమారులు "అయినదానికి విచారించిన లాభము లేదుగదా! అయ్యో, చేయి కాలిన పిమ్మట ఆకులకై వెదుకనేల? చంచలచిత్తుడనై నా అమూల్యమణిని, నా అమాయికను చేతులార వదలుకొంటినే! ఆనాడు కన్నీటిని గాబోలు పైటచే నొత్తుకొనుచు, అమాయిక పోవుచుండ కన్నులార చూచుచుకూడ కమలాకరు డేమనుకొనునో యను భీతిచే పిరికిపందనై శకటమును దిగి ఆమెను కలిసికొననైతి. అటుపై ఎంత వెదకిన నేమి లాభము? అపుడు చూచియు చూడనట్లు నటించితినే. మొదట ప్రపంచమునకు లెక్క జేయగూడదనిగదా తలంచితి. నేనే గతియని నమ్మిన అమాయిక యగు అమాయికను పరిణయంబాడెదనని ఎన్నియో ఆమెకడ ప్రమాణములొనర్చి తుదకు మోసగించితిని గదా! తల్లీ! నిన్నెంత ప్రార్థించినను, వెలికై భయపడి నా గోల అరణ్యరోదనము నొనర్చి, నా జీవితము శూన్యముగా జేసివైచితివిగదా! సర్వేశ్వరా! నా హృదయ మింత కోమలముగా నేల సృజించితివి? కర్కశ హృదయుడనైన యెడల సులభముగా తల్లిమాట నిరాకరించి యుందునే. అయ్యో! ఇపుడు మాత్రము కఠినాత్ముడను గాలేదా! చిత్తరంజనుడగుట కన్న నా తలిదండ్రులు నాకు చంచల చిత్తాయని నామకరణము జేసిన సార్థకనామముగా నుండెడిది" అని తన్ను దా దూషించుకొనుచుండెడివాడు. మరియొకప్పుడు "ఎన్నడో కలుసుకొనిన బాల్యమిత్రుడు కమలాకరుడానాడే—నా అమాయిక కేవియో కొన్ని పుస్తకముల గొన, ఆమెను విడిచి వచ్చిన

నాడే—ఏల కలుసుకొనవలెను వచ్చెనుపో; నన్నేల తన గృహమునకు విందునకు పిలువవలె. పిలచెను పో; అతని సోదరిని వివాహమాడుమని అదివరకె అచటికి వచ్చియున్న నా తల్లి నన్నేల నిర్బంధించవలె. ఆమె ఇదివరకే నాయీపరిణయంబునకై ఏర్పాటు చేసినదని నాకేమి తెలియును? ఇంతకును, ఆమెను చూచినతోడనే నా మనస్సేల చలించవలె? ఆహా, మోహము గ్రుడ్డిదనుట నిజము కదా! పాపము వినయగూడ వినయశీలగదా. ఆమెను మాత్రము నే నేమనగలను? ఏమైన నేమి, నా ప్రేమరాశి, నా పవిత్రప్రేమ పుంజము నాకు దూరమాయెగదా! అయినను బ్రహ్మ నా నుదుట నిటుల వ్రాసినపుడు వేరెటుల జరుగును. పోనిమ్ము! నా అమాయిక ఎచ్చటనో అచట సుఖముగానున్న నా కంతియే చాలును. తండ్రీ జగదీశా! ఆమెను నన్ను మరచునట్లు జేయుము. ఆమె సంతసమే నా సంతసము ఆమెసౌఖ్యమే నా సౌఖ్యము" అని పరిపరి విధంబుల తన అంతరాత్మ తన్నునిందింప, శోకించుచుండెడివాడు. వినయాదేవి తన్నటుల చూచుట తటస్థించునేని ఎంత వగచునోయని త్వరగా కన్నీరు తుడుచుకొని, పూర్వము వలె ఉండుటకు ప్రయత్నించు చుండెడివాడు. పాపము, వినయ కేమియును తెలియదు. భర్తయన్న పంచప్రాణములు. ఒక్కొక్కతరి చిత్తరంజనుడు విచారముగా నుంట కనిపెట్టియు, అడిగిన ఆతనిమన సింకను నొచ్చునేమో యని ఏమియు తెలియనిదానివలె నటించుచుండెడిది. తల్లిదండ్రులు జ్ఞప్తికిరా నటుల ఉండెనేమో యని కొన్ని సమయములయందు తలచుచుండెడిది. ఏమనుకొన్న నేమి; వినయ చిత్తరంజను నెన్నడును ఆతని నిరుత్సాహమునకు కారణ మడుగలేదు. చిత్తరంజనుడు చెప్పలేదు. ఈ విషయమునుగురించి తన ప్రియస్నేహితుడును, బావమరదియు నగు కమలాకరుకడ నైనను చిత్తరంజను డెన్నడు ప్రస్తాపించియుండలేదు. వారును వీరును ఎట్టిశాంతవచనములు బల్కినను, ఆతని హృదయాక్షోభము ఇనుమడించునా! కల్ల. ముమ్మాటికి కల్ల. కాన చిత్తరంజను డీ గూఢవిచారమను అమూల్యమణిని తన హృదయ పేటికయందు జీవమునకన్న ఎక్కుడు జాగ్రతగా పరుల కంట బడకుండ కాపాడుచుండెను. నేడేలనో ఎన్ని విధముల నూరట జెందుదమన్నను ఆతనిహృదయ మాతనికి శాంతి నివ్వకుంటచే చిత్తరంజనుడు భార్యాపుత్ర సమేతుడై తన సౌధమునకు సుమారు నలుబదిమైళ్లదూరములో నున్న నిర్మానుష్యమగు ప్రదేశమునకు షికారు వచ్చియుండెను.

* * * *

సూర్యభగవానుడప్పుడే అస్తమించెను. ఇంతవరకును తొంగితొంగి చూచుచు మరుగుననున్న పూర్ణచంద్రుడు ఇపుడు నిర్భయముగా గగనకాంత ఫాలతలంబున విలసిల్లు కుంకుమబొట్టుకైవడి పైకి వచ్చెను. ఇట్టి సమయమున చిత్తరంజనుడు లీలను వెదకుచు బిట్టుగా వాపోవుచున్న ముదుసలిని సమీపించెను. ఈలోపుగా

లీల తల్లి వద్దకు మరియొక ప్రక్కనుంచి వచ్చినది మనము చూచితిమి గదా.

చిత్తరంజనుని చిత్తము ఆ ముదుసలిని చూచినతోడనే కరగిపోయెను. ఆతని దుఃఖమునకు కారణము కనుగొన కుతూహలుడై చిత్తరంజను డాతనిదరికి బోవుచుండ, ఆ లోపుననే ముదుసలితాత తాను దెచ్చిన పుష్పమాలికలను తనప్రక్క నున్న లతాకుంజము నందలి చలువరాతిమండపముపై నుంచి, "తల్లీ ఈనాటికి నీవు నన్ను వదలి పూర్తిగా ఆరు సంవత్సరము లాయెగదా. దిక్కుమాలిన దేవుడు నా కెంకను ఎంతఆయువు పోసెనో" యని విలపించుచు, చిత్తరంజనునిరాక చూడకయే, ప్రక్క ప్రవహించుచున్న నదీతీరమునకు జని అట జతికిలబడెను. చిత్తరంజనున కిదియంతయు ఏదో చిత్రముగా దోచుటయే గాక, ఆ లతాగృహము, ఆ చోట పూర్వము తా నెప్పుడో చూచినట్లు తోపసాగెను. కొంతతడవచట నిలిచి, చిత్తరంజనుడు తాత ఉన్నచోటునకే తానును బోయి మెల్లగా, "అయ్యా! తమ రేల ఇటుల వగచుచున్నారు? ఈ నిర్జనప్రదేశమునం దీపొదరిల్లేమి? దీనియందీ చలువరాతిమండపమేమి? మీ నామధేయ మెయ్యది? మీ నివాసస్థాన మెయ్యది?" అని మిక్కిలి ఆదరముతో బలుక, తాత తల పైకెత్తి చిత్తరంజనుని నవమన్మథ విగ్రహమును దిలకించి, కన్నీటిని దుడుచుకొనుచు త్వరగా లేచి నిలువబడి, "ఓయీ దేవతా స్వరూపా! నీ వెవరు? నీవు నరుడవని నే నమ్మజాల. దిక్కుమాలిన నావంటి దీనుల మొర నాలింప దేవదేవుడే నిన్నిట కంపియుండనోపు. తండ్రీ! నీ వెవరో ముందు తెల్పుమా" యని ఆతని ముఖమును రెప్పవాల్పక చూడసాగెను. చూడ జూడ తాత కాతనిముఖము నెప్పుడో చూచినట్లు తోచుచుండెను. చిత్తరంజనుడు "మహాశయా! నేను కేవలము నరమాత్రుడనే కాని తమరేల ఇటుల వాపోవుచున్నారో వినుట కర్హుడనని మీకుతోచిన నాకు విన్నవింప వేడుకొనెద. మీ చరిత్ర వినుటకై నామనం బారాటమొందుచున్నది. కాన, ఆలసించక, తత్క్షణము తెల్పరా" అని దీనముగా వేడుకొన, తాతయు "తండ్రీ! నా కథకష్టపూరితము. అయినను, నీవంత నొక్కి నొక్కి నన్నడుగుచుండుటచే చెప్పెద వినుము. అదియుగాక, నిన్ను చూచినంతనే నా చరిత్రయంతయు నీకు విశదీకరించి నా జీవముల నిచ్చుటనే విడువవలె ననుబుద్ధి పొడముచున్నది. సర్వేశ్వరుడు నన్నింతకాలము నీరాకకైయే వేచియుండ నియమించినట్లును, నిన్నీనాడు నన్ను జీవన్ముక్తుని జేయ పంపినటులును గూడ నాకు తోచుచున్నది. అవును సందేహము లేదు. అయ్యో కుమారా! ప్రపంచమున జీవన్మృతులును, మృతజీవులును అను రెండుతెగల జీవులు గలరుకదా! వారిలో నాయనా, నేను మొదటి తెగవాడను. నా గారాబుపట్టి, నా అమూల్యరత్నము, మృతజీవిని గదా! ఆమెను తలచుకొనిన అయ్యయ్యో, నా గుండెలు బ్రద్దలగుచున్నవి. తల్లీ! పదునెనిమిది వత్సరములు నిను పెంచి పెద్దదానను

జేసి తుదకు అకాలమృత్యువు నోట నిడితిగదా. బిడ్డా! అమాయిక వగుటచే ఈదిక్కుమాలిన ప్రపంచమున మోసగింపబడి దానికై స్వార్థ త్యాగినివై ఆత్మహత్యకు బాల్పడితివి గదా! తల్లీ నీవే గదా ఎన్నియో మారులు ఆత్మ హత్యవంటి నీచకృత్యము వేరొండు లేదనియు, ఎన్ని ఎంతటి కష్టములు వచ్చినను, అట్టిపనిని గురించి ఆలోచించనైన ఆలోచించనంటివి. నే డాబుద్ధి ఏనీట గలసె" అనుటయు చిత్త రంజను డులికిపడి, 'ఏమీ ఈ చనిపోయిన యువతి నా అమాయిక కాదుగదా! కాదు. కాదు. ఈతాత తనబిడ్డ అమాయికత్వమునకు శోకించుచుండెనుగాని వేరుగాదు. నా అమా యికను సర్వేశ్వరుడు చిరకాల మాయురా రోగ్యముల నిచ్చుగాత' అని మనస్సు నూర డించుకొని తాత కథను వినసాగెను.

నందలాలు"అయ్యా! నా కూతురు అకా లమరణమునకు కారకుడైన ఆ కలుపాత్ముడు, ఆ కర్కశహృదయు డెన్నడైన నా కన్నుల ఎదుట బడునా? చెప్పుము. తండ్రీ! చెప్పు ము" అని వెంటనే "అయ్యో! ఆతని నెన్నడు దూషింపవలదని గదా నాతల్లి నన్ను కడసారి వేడినకోరిక! తన లేఖయం దదియే గదా మరల మరల నను ప్రార్థించినది. దుఃఖాతిశయముచే ఒడలు మరచి నాబిడ్డ ఆజ్ఞోల్లంఘనము చేయు చున్నాను గదా"అని చిత్తరంజనునితో "మహా శయా! నీ వడిగిన సంగతియే మరచిపోయితిని. నా కథ విశదముగా జెప్ప ఎన్నిదినము లైనను చాలవు కాన ముఖ్యముగా నా యీప్రస్తుతా వస్థకు సంబంధించిన కథను జెప్పెద వినుము." అని తనకథ నీక్రిందివిధమున జెప్పసాగెను:—

"నన్ను నందలాలందురు. మేము బంగాళా దేశవాసులము. మొదట శ్రీమంతులమై యు న్నను, కొన్ని కొన్ని కారణములచే అచటి మా స్వగృహమును, భూములను అమ్మివైచి, ఇచటికి సుమారు మూడుమైళ్ళదూరముననున్న గ్రామమును నివాసస్థానముగా నేర్పచుకొం టిమి. ఈ గ్రామమున మేమే బ్రాహ్మణులము. మిగిలినవా రందరు పసులకాపరులు, మాలలు. అదియంతయు ఇప్పుడేల. ఎందరో బందుగు లున్నను మా దీనావస్థలో ఒక్కరును మాకు సహాయము జేయరైరి. దిక్కులేనివారికి దే వుడే దిక్కని రెండువర్షముల బిడ్డతో నేనును, నాభార్యయు ఇచటికి వచ్చి చేరితిమి. వచ్చిన వత్సరము లోపుననే నా భార్య గతించెను. ఈ బిడ్డ నా ముదుసలితనమున జన్మించుటచే నా కామెపై అపరిమిత మమకారము. వరప్రసాదిని గదా! చిన్నతనమునుండియు నా బిడ్డకు తరు గుల్మలతాదులే ప్రియమిత్రులు-ఇక పుష్పముల నినను ఆమె కెంతప్రీతియో నే చెప్పజాల. ప్ర పంచస్వభావ మెరుగనిగోల. నేనే ఆమెకు విద్య బోధించితిని. ఎంతటి తెలివితేటలు. ఎంత చురుకుదనము. అయ్యయో! అంతయు అడ విని గాచిన వెన్నెల—ఇదిగో ఇప్పుడు గాచు చున్న పండువెన్నెల—వలెనే అయినదిగదా! ఎక్కువ భాగ్యవంతుడను గాకపోవుటచే విద్యా విభూషలను దప్ప మరియేమియు బంగారువెండి నగల నేను నా బిడ్డకు పెట్టలేకపోయితిని.

ఒక్కొక్కప్పుడు నా ప్రియతనూజతో, 'తల్లీ, నీ సర్వాంగములకు వెలగల నగల జేయింప భగవంతుడు నన్ను సమర్థునిగా జేయలేదుగదా' అని ఇంకను ఏమియో పలుకబోవుచుండగనే నామాట కడ్డము వచ్చి, 'నాయనా! ఈ వెండి బంగారు నగలు నా కేల? మిక్కిలిబరువుగదా! పెద్దలమాట శిరసావహించుట యనెడి ఈ వెలగల నగ తలపై ధరింప, తండ్రీ! నీ విచ్చినదేగదా. ఎంతటి వెలగల మణులతో తాపించిన బంగారు బిళ్లలైనను దీనికి సాటివచ్చునా? భూతదయ యను ఈహృదయాభరణమునకు ఎట్టి తారహారములైనను సాటియగునే. ఇక జనకా! హస్తములకు దానమను భూషలుండ కంకణము లేల? సత్పథమున నడచుట కన్న కాలికి వేరునగ యేల? కాన తండ్రీ ఇవి నీ విచ్చినవేగదా! ఈ విద్యాభూషలకు ఎట్టి వజ్రవైడూర్యములతో గూడిన నగలైనను నాకిచ్చి నగలైనను సాటివచ్చునే? కాన నీవెన్నడును వాటికై చింతింపకుము' అని ఓదార్చుచుండెడిది. నా బిడ్డ విద్యయను బంగారు నిలువుతొడవుతో సరస్వతీదేవిని తిరస్కరించుచుండె ననుటయందు—అయ్యో!—కొంచెమైనను అతిశయోక్తి లేదు. ఇటుల నాగగనకుసుమము, నా అడవిపుష్పము శుక్లపక్ష చంద్రునివలె ప్రవర్ధమాన మగుచుండ, నాపుట్టి మునిగినట్లు ఆమెకు పదియేండ్లైనను పూర్తిగాకుండగనే వివాహము జేసితిని. ఎన్నివిధముల ప్రార్థించినను నా దుర్బుద్ధి తిరుగక ధనమునకాసించి కొంచెము వయసుజెల్లిన వానికి నా చిన్నబిడ్డను బలినివ్వ ప్రోద్బలముజేయ, చేతులార ముక్కుపచ్చలారని నాముద్దుబిడ్డను వానికి కట్టబెట్టితిని. వివాహమైన కొలదినెలలకే ఆ వరుడు గతించెను. ఇక నే నేమి చెప్పగలను? తండ్రీ, నా అమాయికి కేమియు తెలియదు. అది వట్టిబేల. ఆమెకు వయసు వచ్చినపిదపగూడ నే నెన్నడు ఆమెతో ఈవిషయమై ప్రసంగించలేదు. ఇంటి కెన్నడైన నీ అట్టివారు వచ్చినపుడు మాత్రము వారితో నా హృదయవేదనను జెప్పుకొని నా కూతునందు జూపిన నిర్దయకై భగవంతుని వేవిధముల నిందించుచుండెడి వాడను. దినములిటులైన గడువకూడదా? భగవంతుని కన్నుకుట్టెగాబోలు. అయ్యో, సరిగా నేటికి ఆరు వత్సరములాయెగదా. నాయనా, ఆరువర్షముల క్రితము ఈ పౌర్ణమిదినముననే పసులకాపరులబిడ్డల వెంట నిడుకొని తనతల్లి విగ్రహమును పూజింప పూలకొరకై యీ ప్రదేశమునకే నా అమాయిక సాయంకాలమున వచ్చియుండెను. నీవు చూచిన పొదరిల్లు ఆమె ఏర్పరచినదే సుమా. ఆనాడు ప్రతిదినమువలె గాక, ఆమె ఇంటికి వచ్చుట కాలస్య మగుటచే, ఆమెను వెదకుచు నే నిట కేతెంచితిని. ఆనాడే నా కష్టములు ప్రారంభమాయె గదా! నా బిడ్డ సగముదూరమున నాకెదురుగా వచ్చుచుంట జూచి, 'తల్లీ నే డేల ఇంత ఆలస్యము జేసితివి. నీ చెలికత్తె లేరి' అని యడుగ, 'తండ్రీ! మేము పూవుల గోసుకొని ఇంటికి బయలుదేరి వచ్చుచుండ ఇటకు కొన్నిగజముల దూరమున నే తలక్రిందులై పడియున్న శకట

మును, దానికి కొన్ని అడుగుల సమీపము లోనే స్మృతిదప్పి పడియున్న ఒకయువకుని గాంచితిమి. ఆతనికాలికి బాగుగా గాయము తగులుటచే రక్తము స్రవించుచుండెను. తత్క్షణమే నా స్నేహితురాండ్ర సహాయముచే నాతని మెల్లగా నా పొదరింట పరుండజేసి ప్రక్కనున్న నదీజలముతో ఆతనిగాయమును శుభ్రపరిచి కట్టుగట్టితిని. ఇంకను ఆతనికి తెలివి వచ్చినట్లు తోపదు. ఈసంగతి నీకు దెలిపి, పాపము, దీనావస్థలోనున్న ఆతని మన ఇల్లు జేర్ప వచ్చుచుంటిని. నాతో వచ్చినవారిని నే తిరిగి వచ్చువఱ కాతని భద్రముగా జూడ అచ్చటనే ఉంచితి'నని చెప్పి మాకు కొన్ని గజముల దూరములోనున్న శకటమును జూపెను. సరి. వినుచున్నావా! ఆనాడే మృత్యుదేవత నాఇంట ప్రవేశించినది గాబోలు" అని ఇంకను ఏమో చెప్పుచుండ, చిత్తరంజనునకు ఒడలంతయు వేయి తేళ్లు కుట్టినట్లాయెను. శరీరమంతయు ఉడికిపోవుచుండెను. లేచి ఇటునటు పచారు చేయుచు, 'అయ్యో! కథనుబోలిన కథ యుండ గూడదా! నా మనస్సేల కీడునే శంకించ వలయును? నిజముగా ఈ చనిపోయిన రమణి నా అమాయికయే యైన, నేను మృత్యుదేవతను గాక మరెవరు? వలదు వలదు! పాడు హృదయమా! కీడును తలపకుము. ఇది ఎన్నటికిని నా అమాయిక కాదు.' అని మనస్సు నూరట నొందించుకొని, మరల తాతప్రక్కను కూలబడెను. నందలాలు "అయ్యా, మీకు ప్రొద్దు పోవుచున్నది కాబోలు"అన, "లేదు లేదు. నాకేదియో జ్ఞప్తికి రాగా పరధ్యానముగానుంటిని గాని వేరుగాదు. చెప్పుము. మహాశయా! నీ కథను సాంతముగా, విశదముగా జెప్పుము" అని చిత్తరంజనుడు బలుక, ఆ ముదుసలి మరల ఇటుల పలుకసాగెను:—

"ఆర్యా! నిన్ను జూచినతోడనే ఆ యువకుడును, నీవును సోదరులేమో యని భ్రాంతి నొందితిని. నీకును, ఆతనికి భేద మేమన, ఆతను నీకంటె వయసున కొంచెము చిన్నవాడు. పూర్తిగా ఇరువది రెండువర్షములైన ఉండియుండవు. కొంచెము నీకన్న పొట్టి. కాని నీముఖము నందలి పాండువర్ణ మాతనియందు లేదు. మిక్కిలి ఆరోగ్యముగా నుండెను. ఆతను మిక్కిలి భాగ్యవంతుల ఇంట జన్మించినవాడువలె తోచెను. ఇంతకు, ఆతను నా ఇంట కొన్ని నెలలే గదా యుండెను! అనగా, ఆతని గాయము బాగుగా నిమ్మళించువరకును, అటుపైగూడ కొన్ని దినము లుండెను. నాబిడ్డ కప్పటికి, పదునెనిమిది వత్సరములు. అయ్యో! ఇపుడుగదా జ్ఞప్తికి వచ్చినది. ఆతనిగాంచినది మొదలు నా ముద్దుపట్టి ఆతని తనబహిఃప్రాణమువలె జూచుకొనుచుండెడిది. ఒక్కనిముసమైన ఆతని నెడబాసి యుండెడిదిగాదు. అత డెచటికైన వెడలి ఇంచుక వచ్చుట కాలసించిన, ఆతని కెదురేగుచుండెడిది. ఎన్నియోమారులు నేను 'తల్లీ లోకులేమైన ననుకొనెదరు. దయార్ద్ర హృదయవగుటచే నీవాతని అంతటిదయతో నాదరించుచుంటివి. కాని తాటిచెట్టుక్రింద పాలు దాగినను మరియొక విధముగా నెంతురుగదా' అన,

'తండ్రీ!లోకులు కాకులు. వారిమాటలు లెక్కజేసిన మన మీధరిత్రిని జీవించుటయే దుర్లభము. మనము తప్పు జేసిన మనఅంతరాత్మ మనల మన్నించునా? ఎంతటి దండనకైన అది వెనుదీయునా. కాన నాయనా, నను మన్నింపుము. నా యంతరాత్మ నే నెట్టి తప్పును జేయుచుంటివని నాకు జెప్పుటలేదు. కాన నే నీ యువకునియెడ వేరుభంగి ప్రవర్తింపజాల' నని పల్కి ఈవిషయమునమాత్రము—ఈ ఒక్క విషయమును మాత్రము—నాతనయ నామాట నిరాకరించెను. ఆపన్నునియందలి దయచే ఇటుల ప్రవర్తించుచుండెనని ఎంచితిని గాని ఆతనిపై ఆమెకు గాఢానురాగమని నే నెంచనైతి. నాకను లపుడు నిజముగా మూసికొనిపోయినవి. అతనితోగూడ ఎన్నియోమారులు నేను మా కుటుంబాచారమును గురించియు, నా బిడ్డవివాహమును గురించియు సంభాషించియుంటిని. ఇటుల కొన్ని నెలలు గడచిన పిదప ఆతను నా గృహమునుండి మరల వచ్చెదనని చెప్పి వెడలి, నాటికిని నేటికిని మరల ఈప్రక్కకు రాలేదు. ఆతని సామానంతయు నేటికి గూడ నా గృహమునందే యున్నది. అయ్యో! సామానన్న జ్ఞాపకము వచ్చినది. జీవముల త్యజించుటకు ముందు నా బిడ్డ నాకొక లేఖయు, నాయువకుని కొకటియు వ్రాసియుండెను. నాకు వ్రాసినదానియందే ఆ రెండవలేఖను తన 'మనోహరు' డెన్నడైన కాన్పించిన, ఇవ్వ ప్రార్థించినది—తల్లి 'మనోహరుడు' అవును. కాకేమి. ముమ్మాటికి మనోహరుడే. ప్రపంచాచారము సరణి పరిణయం బాడకపోయినను ఆమె మనస్సును హరించినవాడుగదా! మనోహరుడు గాక మరెవరు. అదియే తాను మొదటిమాటు పరపురుషు నట్టి నిష్కల్మష ప్రేమతో ప్రేమించితిననియు, కాన అతనే తన హృదయసామ్రాజ్య చక్రవర్తిఅనియు గూడ వ్రాసియుండెను. నా బిడ్డకై ఆయువకు డీక్షణమున నా కంటబడినను, కౌమారుని కైవడి ఆలింగన మొనర్పనా? అటుల చేయుమనియే గదా నా తనయ ఆజ్ఞ. ఆహా! ఎట్టిసహనము. ఎంతటి శాంతి. తరువాత—నాయనా! ఏల కన్నీరు కార్చుచున్నావు" అని ఇంకను ఏదో పలుకుచుండ, 'తాతా, చెప్పుము. నీకథను చెప్పుము. ఈ నీ యుదంతము నల్లఱాయినైన కరిగించునే. అందరు నావలెనే యుందురా!'అనుటయు, తాత మరల ఇటుల చెప్పదొడగెను: "అయ్యా, వినుము. కొన్ని నెలలైనపిదప ఆతను వెడలిపోయెనని చెప్పితినిగదా! వెడలిన నాలుగైదు దినములకు నా అమాయిక ఒకదినము ప్రాతఃకాలముననే ఎచ్చటికో వెడలి భోజనమైనను లేక రోజంతయు తిరిగి తిరిగి సాయంకాలమునకు ఇల్లు చేరుకొనెను. ఏమనిన ఆమె సరళహృదయమునకు నొప్పి గల్గునో యని పల్లెత్తి గట్టిగానైన ఎన్నడును ఆమెతో పలుకనైతి. ఆసాయంకాలముననే వచ్చెదననియు, అటుపై మరునాడు వచ్చెదననియు వర్తమాన మంపి కొన్నిదినములు గడచినను రాకపోవుటచే ఆ యువకుని వెదకుచు అటుల వెడలితినని తన లేఖవల్లగదా ఆమె నాకు తెలియజేసినది.

ఎంతటిపిచ్చి. ఇట్టి అమాయికత్వ మెందైన
గలదా? అయ్యో! ఈ నిమిషమున కున్న బుద్ధి
మరియొకనిమిషమున కుండని చంచలచిత్తు
లగు మానవమాత్రులు అచేతన వస్తువులు
గారుకదా ఒక్క-చోటనే యుండుటకు. అటుపై
ఇంటికి వచ్చినపిదప నాతల్లి ఒకవారము దిన
ములు మాత్రమే జీవించినది. అన్నిటియందును
విరక్తిభావమును జూపుచుండెడిది. ఆమె శరీర
మునందు స్వస్థత లేమి అటుల ఉండెనేమో
యని తలచితిని.

"పౌర్ణమిదినము రాత్రి సుమారు ఎనిమిది
గంటలకు ఆదినము ప్రాతఃకాలమునపనికై పక్క-
గ్రామమునకు బోయిన నేను ఈయొడ్డుననే వడి
వడి ఇల్లుజేర నడుచుచుండ, దూరమున, ఏది
యో మనుష్యాకారము గల రూప మొందు
కొట్టుకొనివచ్చుట గాన్పించినది. అయ్యో!
అది నాముద్దుబిడ్డదని నే నెన్నడైన తలచితినా!
కలనైన అట్టిపని, అంతటి సాహసకృత్యము,
ఆమె చేయునని, చేయగలదని, ఊహించ
నైన ఊహించితినా!——వడివడి నడచుచు దా
నిని పరిశీలించుటకై సమీపించితిని. అయ్యో,
రాజహంసవలె నాకన్నతల్లినే, నదియందు
కొట్టుకొని పోవుచుండెను. నాకన్నులు చీకట్లు
గ్రమ్మెను. శరీరమున ముచ్చెమటలు బోసెను.
తల భారమెక్కె-ను. 'అమాయికా! నా అమా
యికా'అని ఎలుగెత్తి గుండెలవియున ట్లొక కేక
వైచి క్రింద పడిపోతిని. అటుపై ఏమి జరిగెనో
నాకు తెలియదు. నేను కనులు తెరచి చూచునప్ప
టికి నా ఇంటియందు మంచముపై బడియుంటిని.

పసులకాపరి యొకడు నాకు పరిచర్య జేయు
చుండెను. భగవంతు డింకను ఈ మొండిజీవిని
భూమిపై ఎండుమోడువలె నిలుప వానిని పంపి
యుండనోపు. అపుడు నాతనయ తన మేజాపై
నుంచిన రెండులేఖలను జూచితిని. నాకు వ్రా
యబడిన ఉత్తరమును చదివితిని. ఆమెకు
ఆ యువకునిపై ఇంతటి గాఢానురాగమని
అపుడుగదా తెలిసికొంటిని. వారు మొదట,
మొట్టమొదట, ఈలతాకుంజమునకలిసికొంటచే
ఆమె తనశరీరమును దానియందు దగ్ధము
చేయ తన కడసారి కోరిక యని వ్రాసినది. అతని
బాసి ఒకక్షణమైన జీవించుట దుర్లభమనియు,
అతని తా నీజన్మమున——తనకొరకై ఆతని
పలుకష్టములపాలు చేయనిదే——పరిణయంబా
డుట అసంభవమనియు, కాన తన కీజన్మమున
సౌఖ్యము లేదనియు, కాన ప్రాణముల త్యజిం
చితిననియు కూడ వ్రాసినది. ఆమె తుది
కోరికప్రకారము, అదే ఆలతా గృహము
మధ్య నామెశరీరమును_అయ్యో! నా ప్రియ
తనూజ మేలిమిబంగారమును తిరస్కరించు శరీ
రమును_దగ్ధముజేసి, అట నావద్దనున్న ధన
మంతయు వెచ్చించి చలువరాతితిన్నెను ఆమె
కోరికప్రకారము గట్టించితిని. ఇక నాకు ధన
మేల? ప్రాణ మేల?

"అయ్యో! ఆనా డాయువకు డెన్నియో
విధముల నాబాలికకు మరల వివాహము చేయు
మని బోధించినను చెవిబెట్టనైతి. మూఢాచార
మును వదలనైతి. తల్లీ! ఇపుడు నిజముగా
జీవించియుండిన అట్టి వివాహమునకు అభ్యం

తరపెట్టుదునా? అయ్యయో! ఆ యువకు
డెన్నడైన నాకన్నుల బడునా? నాబిడ్డ కడసారి
రెండవయాజ్ఞ జెల్లింపకయే నా ప్రాణములు
వదల వలయుగాబోలు. ఈ రెండవకమ్మ ఎవరి
కిత్తును" అనుచు ఇంకను ఏమియో చెప్పబోవు
చుండ చిత్తరంజనుడు తన రహస్యవేదన నిక
భరింపలేక కన్నీరు మున్నీరై పార చిన్నబిడ్డ
వలె శోకించుచు, "తండ్రీ! ఆ భాగ్యరాశి పేరు
చెల్పుమా? అదిగూడ వినినపిదప నాసందే
హము పూర్తిగా పటాపంచ లగును" అను
ఈమాటల అర్థము పూర్తిగా గ్రహించకయే,
"నాయనా! ఇంతవరకును నా సుగుణరాశి
నామమే చెప్పలేదా? అయ్యో! పేరున
నేమున్నది? అమాయికయే. నా అమాయిక
కడు అమాయిక; గోల;కడు బేల. ఆముద్దరాలికి
నేను నామకరణమే చేయలేదు. బాల్యమునుండి
యు ఆమె అమాయికత్వమును జూచి సర్వజను
లును ఆమెను "ఎట్టి అమాయిక, ఎంతటిబేల"
యని పలుక అదియే ఆమెకు నామకరణమాయె
ను" అని నందలాలు పలుక చిత్తరంజనుని
చిత్తము వేయివ్రయ్యలగున ట్లాతనిగుండియలు
అతితీవ్రముగా కొట్టుకొన సాగెను. కాని నిజ
ముగా గుండె బ్రద్దలగునెడల ఇప్పటికి ఎంత
మంది అట్టి మృత్యువువాత బడియుందురో! ఎట్టి
కష్టములైన రానంతవరకేభయముగాని వచ్చిన
పిమ్మట వాటిని భరింప శక్తుల చేయుట లేదా?—
చిత్తరంజనుడు చిన్నిబాలుని కైవడి విలపిం
చుచు, తానే ఆకలుషాత్ముడనియు, కర్కశ
హృదయుడనియు, కఠినచిత్తుడనియు, ఆమె
మనోహరుడే గాక జీవితాపహారుడుగూడ తా
నే యనియు పల్కుచు నందలాలు పాదములపై
పడిపోయెను. తాత తలపై పిడుగు పడినట్లా
యెను. నోటినుండి మాట రాలేదు. మరల
చిత్తరంజనుడు "అయ్యో! నా అమాయికా,
నా ప్రియతమా! నీ వెచ్చటనో ప్రాణములతో
నుంటివని ఎంచితిని గాని ఇటుల నీప్రాణముల
నాకై, నావంటితుచ్ఛునికై, త్యజింతువని ఎన్న
డును తలపనైతి. ఓతల్లీ! చూచితివా! బంధు
జనుల పరిహాసమునకును, ముఖ్యముగా వెలి
యను మానవకల్పిత మగు ఘోరపిశాచము
నకును భీతిల్లి నాప్రార్థన నిరాకరించితివిగదా!
నన్ను హంతకునిగా, నరహంతకునిగా, తుదకు
మార్చితివే.అయినను నిన్నేలదూషింపవలె?స్థిర
చిత్తుడను కానందులకు నేనే నన్ను దూషించు
కొనవలె. అమాయికా!దిక్కుమాలిన ప్రపంచ
మునకు నేనుకూడ కొంచెము వెరచిగదా ప్రాణ
ములకన్న నిన్ను ఎక్కుడుగా ప్రేమించియు,
పరిణయంబాడక తుదకు నీప్రాణములనే హ
రించితి. నాప్రాణముల నీకర్పించుటకు బదులు,
నీవా! నీవా! నా అమాయికప్రాణములా నేను
బలిగొనుట! ఛీ. ఛీ. చిత్తరంజనా! కాదు.
కాదు. కఠినచిత్తా! నీ వీభూమండలమున
నుండదగవు పొమ్ము. నీ అమాయిక ననుస
రించి పొమ్ము." అని వేవిధంబుల తన్ను దా
నిందించుకొనుచు హృదయము వ్రయ్యలగు
నట్లు శోకించుచుండ, నందలాలు మెల్లమెల్ల
గా లేచి పొదరింటియందలి చలువతిన్నెపై
నున్న లేఖను తడబడు నడుగులతో చిత్తరం

జనునికడకు గొనివచ్చి దాని నాతని కరమునం దిడి,—"సర్వేశా! నా ఆత్మ ఇప్పుడుగదా శాంతి నొందినది. బిడ్డా, నీ తుదికోర్కె నెర వేర్చి ఇదే నిన్ను కలుసుకొనవచ్చుచున్నవాడ" అని పలుకుచు వెనుకకు విరుచుకొని పడిపోయెను. అంతటితో ఆతని ప్రాణపక్షు లెగిరి పోయెను.

*  *  *  *

పండువెన్నెలయందు పొదరింటియందలి చలువరాతిపై ఆసీనుడై పాపము చిత్తరంజనుడు అశ్రుపూరితనయనములలో తన అర్ధాంగి అమాయిక లేఖ ఈ విధముగా చదువసాగెను:

"నాసర్వస్వమా!

"ని న్నేమని సంబోధింపవలెనో తెలియకున్నది. నీకు నేను సర్వస్వమను గాకపోయినను నీవే నాకు సర్వస్వమగుటచే ఆ పైవిధమున వ్రాసినందులకు కినుక వహింపకుము. నా హృదయకమలము నీ కర్పించితిని; స్వీకరించినను, నిరాకరించినను గూడ సంతసమే. మూడు దినములలో వచ్చెదనని చెప్పి గావైతివి. నీకై వెదకి వెదకి వేసారి, తుదకు హతాశనై నీవు లేనిదే జీవించుట దుర్లభమని యెరిగి, ఇదే నాప్రాణముల నీ కర్పించుచున్నదాన. నీ వేల వెడలిపోతివో ఇపుడు గదా నే గ్రహించితి. కాని నిన్ను నే నెన్నడును—త్రికరణశుద్ధిగా జెప్పు నావాక్యముల నమ్ముము: నమ్ముము, నాపలుకుల నమ్ముము—ఎన్నడును నిందింపజాల; నిందింపను. దీనికై ఈనా చావునకై ఎన్నడైన ఎవ్వరైన ఎవరినైన నిందించినను, దూషించినను, మన సంఘమును గాని మరి ఇతరుల నెవ్వరిని దీనికి కారకులుగా జేయరని నే తలచెద. అటుల జేయరుగాక యనిగూడ ప్రార్థించెద. కాన, ప్రియతమా! నాకొరకై నీ వారాట మించుకంతయైన నొంద వలదు. నీ ముఖారవిందము నేనాడు గాంచితినో ఆనాడే నిన్ను నాహృదయసామ్రాజ్య చక్రవర్తినిగా జేసుకొంటి. నీమూర్తి నాహృదయమున పదిలపరచుకొంటి. కాన ఇపుడు నాతో కూడ నిన్ను దీసికొనిపోవుచున్నాననియే నా నమ్మకము. అట్టిసమయమున 'నాథా! నిన్ను వీడిపోవుచున్నాను. సెలవిమ్ము' అని ఎటుల వేడుదును? నీ నిజపాదపద్మములసన్నిధి నాప్రాణముల త్యజింపవలయు ననెడి నా వాంఛ నెరవేరకపోయినను, నా మనోనేత్రమున నీ మూర్తిని సృజించి నీ సన్నిధినే ప్రాణముల బాయుచున్నందుల కెంతయు సంతసించుచున్నదాన. కాన, మత్ప్రాణనాథా! జీవితేశ్వరా! నీ వెన్నడు నాకొరకై కన్నీరు నింపకుము.

"ఇక,ఎక్కడనో నీవు జీవించియుంటివనియే నానమ్మకము. అటు గాకపోయిన, ఇదే నిన్ను కలుసుకొనుటకై నే వచ్చుచున్నదాన. లేని యెడ అట నీరాకకై యెదురు జూచెద. లేదు. అటులకాదు—నా యీసూక్ష్మ దేహమునకు, నా అంతరాత్మకు, శాంతిలేదు. కాన, అహర్నిశలు, సదా, నేను, ఒకవేళ నీవు వలదనినను కూడ, నీవద్దనే, నీలోనే, నీహృదయకుహరమున నే, నివసించుదాన. కాన విచారింపకుము.